# సరోజ మొగుడు

ఆ ఆఫీసులో రిపోర్టు చేశాక ఒకరోజు లీవ్ పెట్టి ఇంట్లోకి కావాల్సిన వస్తువులు కొనుక్కోవాలంటే నాకు లీవ్ పెట్టే అవకాశమే దొరకలేదు. బిజీ అయి పోయాను. ఇవాళ కాస్త ఖాళీ దొరికింది. అందుకే మధ్యాహ్నం నుంచీ పర్మిషన్ తీసుకుని వచ్చేశాను.

పదిహేడో తేదీ నా పుట్టినరోజు. పుట్టిన రోజుకి చీర కొనుక్కోవడానికి ఆబిడ్స్‌లో ఉన్న పెద్ద డిజైన్డ్ శారీస్ షాప్‌కి వెళ్లాను. షోకేసులో ఉన్న చీరలు చూస్తున్న నన్ను ఎంతో మర్యాదగా ఆహ్వానించాడు కౌంటర్ ముందు కూర్చున్న మేనేజర్. "రండమ్మా... లోపల చాలా మంచి చీరలు ఉన్నాయి" అన్నాడు ఎంతో వినయంగా. నేను అతని ఆహ్వానం మన్నించి లోపలికి వెళ్లాను.

"కూర్చోండి"

సేల్స్‌బాయ్ స్టూలు నా దగ్గరకు జరిపి, అరల్లో ఉన్న అందమైన చీరలు తీసి ఒక్కో చీర మడతలు విప్పి బట్ట నాణ్యత, రంగు, డిజైన్ చూపిస్తున్నాడు.

"బాబూ! ఆ బ్లూ కలర్ చీర ఇలా ఇవ్వు" నా కుడిచెవి దగ్గరగా వినిపించిందో స్వరం. తలతిప్పి చూశాను. ఒక్క క్షణం ఆశ్చర్యం! ఆమె... సరూ...! "సరోజా!" ఆనందంగా పిలిచాను.

ఆమె నావైపు చివ్వున తలతిప్పి చూసింది. ఆ కళ్లల్లో అంతులేని ఆనందం. "ఏయ్ సుధా నువ్వా... అబ్బ ఎంతకాలమైందే నిన్ను చూసి... నువ్వు హైదరాబాద్‌లో లేవుగా... ఎప్పుడొచ్చావు? ఎలా ఉన్నావు?" గబగబా మాట్లాడుతూ నా చేయి పట్టుకుంది.

"ప్రమోషన్ మీద ఈమధ్యే ఇక్కడికి బదిలీ అయింది. మెయిన్ ఆఫీసులో రిపోర్టు చేసి వారం అవుతోంది. ఇంతకీ నువ్వెక్కడ ఉంటున్నావు? ఎలా ఉన్నావు? ఈ అమ్మాయి ఎవరు?" సరోజ పక్కనే నిలబడి మావైపు వింతగా చూస్తున్న పధ్నాలుగేళ్ల అమ్మాయిని చూస్తూ అడిగాను.

"ఎవరేంటే బాబూ! నా కూతురు దివ్య, టెన్త్ చదువుతోంది."

దివ్య సరోజ భుజాల మీదికి ఒంగి నెమ్మదిగా అడుగుతోంది. "ఎవరు మమ్మీ ఈ ఆంటీ..."

"నా ఫ్రెండ్. మేమిద్దరం ఆరో తరగతి నుంచీ డిగ్రీ దాకా కలసి చదువుకున్నాం" కూతురికి సమాధానం చెప్పి నావైపు చూసింది. "నీకెంతమందే పిల్లలు?"

నేను నవ్వి "చెప్తాలే... మా ఇంటికి రా... హాయిగా మాట్లాడుకుందాం" అన్నాను.

"ఎక్కడుంటున్నావు? మీ ఆఫీసెక్కడా?"

"ఆఫీసు పంజగుట్టలో, ఇల్లు ఆనంద్‌నగర్ కాలనీలో."

దివ్య నెమ్మదిగా మళ్లీ ఏదో గొణిగింది సరోజ చెవిలో. సన్నగా, తెల్లగా, పొడుగ్గా ఉంది దివ్య. వంకీలు తిరిగిన జుట్టు వత్తుగా, భుజాల దాకా ఉంది. జుట్టు పైకి దువ్వి కొంత భాగాన్ని వదిలేసి, మిగతా భాగం క్లిప్పు పెట్టుకుంది. లాంగ్‌స్కర్ట్, టాప్... ముద్దుగా, అందంగా ఉంది. సరోజ పోలికలు మొహంలో స్పష్టంగా కనిపిస్తున్నా, పర్సనాలిటీ మాత్రం సరోజది కాదు. సరోజ పొట్టి. ఐదడుగులే ఉంటుంది. పైగా ఇప్పుడు లావై మరీ పొట్టిగా అనిపిస్తోంది. బాగా పొట్ట వచ్చేసింది. వాళ్లని పరిశీలిస్తున్న నాతో అంది సరోజ "సర్లే నీ ఫోన్ నెంబరు ఇవ్వు ఫోన్ చేస్తాను."

"ఫోన్ చేయడం ఏంటి? చాలాకాలమైంది మనం కలసి కాస్సేపు కబుర్లు చెప్పుకుందాం చీరల సెలక్షన్ అయిందా నీది?"

"నేను చీర కోసం రాలేదు. దీనికి డ్రెస్ మెటీరియల్ తీసుకున్నాను. బిల్లు కట్టేసి వెళ్తుంటే, అదిగో ఆ చీర బాగున్నట్టు అనిపించి చూద్దామని అడిగాను. మరి వస్తానే. దివ్య ట్యూషన్‌కి వెళ్లాలి. టైమైంది" భుజాన బ్యాగు, చేతిలో కవర్లు. సంసార భారం అంతా తన మీదే ఉన్నట్టు అనిపించింది. దివ్య చేతులు రెండూ ఖాళీగా ఉన్నాయి. తల్లి చేతుల్లో బరువు అందుకునే ప్రయత్నం ఏదీ చేసినట్టు లేదు.

"ఓ కవర్ తన చేతికివ్వచ్చుగా" అన్నాను.

"దాని మొహం దాని శరీరం బరువే అది మోయలేదు. ఇదేం మోస్తుంది" అంది జారిపోతున్న బ్యాగును చేయి ఎగరేస్తూ పైకి తోసుకుంటూ.

ఎంత ప్రేమో కూతురంటే. ఇంత సున్నితంగా పెంచడం, తరవాత బాధ పడడం. తల్లులంతా ఇంతే! సరోజ అప్పుడే వెళ్లిపోతాననడం నాకు చాలా నిరుత్సాహంగా అనిపించింది. చిన్ననాటి స్నేహితురాళ్లం. ప్రాణానికి ప్రాణంగా

బతికినవాళ్లం. పెళ్లిళ్ల వల్ల, కెరియర్ డెవలప్‌మెంట్ గురించిన తపన వల్ల మామధ్య దాదాపు చాలా ఏళ్ల గ్యాప్. డిగ్రీ అవగానే సరోజ పెళ్లి చేసుకుంది. నేను పి.జిలో చేరాను. సరోజ పిల్ల తల్లి అయ్యేటప్పటికి నా పీజీ పూర్తయింది. ఆ తరువాత గ్రూప్ 2 పరీక్షలు రాసి, రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సంపాదించాక డిస్ట్రిక్ట్ ఆఫీసర్‌గా ఊళ్ళు తిరగడం. దాంతో మా స్నేహానికి చిన్న అంతరాయం. ఏది ఏమైనా స్నేహం స్నేహమే. ఇంతకాలానికి కలిసిన తరవాత కాసేపు మనసు విప్పి మాట్లాడుకోకుండా వెళ్లడం ఏంటి? మళ్లీ ఎప్పుడు కలుస్తామో ఏమో, అందుకే అడిగాను "మళ్లీ ఎప్పుడు కలుస్తావు?"

"ఫోన్ చేసి చెప్తానే. ముందు అనుకుంటే నాకసలు కుదరదు. ఈ పిల్లలతో, ఆయనతో. వీలు చూసుకుని వస్తా. అయినా నువ్వే రాకూడదూ... మా ఇంటికి" అంది మళ్లీ.

"ఎక్కడ మీ ఇల్లు?" అడిగాను.

"చిక్కడపల్లిలో దగ్గరేగా. కాసేపు కూర్చుని వెళుదువుగాని రావే" అభ్యర్థనగా అడిగింది సరోజ.

నేను వెళ్లడానికి నిశ్చయించుకున్నాను. 'ఒక్క క్షణం' అంటూ మావైపే సీరియస్‌గా చూస్తున్న సేల్స్‌బాయ్ వైపు చూసి, నాకు అంతకుముందు నచ్చిన లేతాకుపచ్చరంగు చీర ప్యాక్ చేయమని చెప్పాను.

"నేను ఆటో మాట్లాడతాను. ప్యాకెట్ తీసుకుని వచ్చెయ్" అంటూ సరోజ బైటకి నడిచింది. దివ్య తల్లిని అనుసరించింది.

నేను బిల్లు చెల్లించి, చీర కవర్ తీసుకుని బైటకి నడిచాను. అప్పటికి ఆటో మాట్లాడి తల్లీకూతుళ్లు ఆటోలో కూర్చున్నారు. నన్ను చూస్తూనే "రా... రా" అంది సరోజ. నేను నాలుగు మెట్లు దిగి ఆటో ఎక్కాను.

"చిక్కడపల్లి పోనీ బాబూ" అని ఆటోడ్రైవర్‌కి చెప్పి, "ఇంక చెప్పవే ఏంటి విశేషాలు? నీకు ప్రమోషన్ వచ్చిందా? అవునూ నీకు కారివ్వలేదా?"

"ఇంకా పర్సనల్‌గా ఇవ్వలేదు. ఉదయం ఇంటికొచ్చి పికప్ చేసుకుని, సాయం కాలాలు ఇంటి దగ్గర దింపేస్తారు" అన్నాను సర్దుకుని కూర్చుంటూ.

"అలాగా... మీ ఆయన ఏం చేస్తున్నాడు? అయినా నీ పెళ్లిక్కూడా పిలవలే దేంటి? మన మధ్య కరస్పాండెన్స్ లేనంత మాత్రాన నన్ను వెలేస్తావా? మన స్నేహం మర్చిపోతావా? నిన్నసలు క్షమించకూడదు" గలగలా ప్రశ్న, జవాబు

తనే వేసుకుంటూ నాకు జవాబు చెప్పే అవకాశం కూడా ఇవ్వకుండా మాట్లాడేస్తోంది సరోజ. తనకి ఇద్దరు పిల్లలని, దివ్య పెద్దదని, కొడుక్కి పదేళ్లని, వాడు మొండిగా తయారవుతున్నాడని. పిల్లలిద్దరినీ తండ్రి గారాబం చేస్తాడని, తాతగారు– మామ్మల గారాబం కూడా ఎక్కువని... ఇలా చాలా విషయాలు దారిపొడుగునా చెప్తూనే ఉంది. దివ్య మౌనంగా రోడ్డువైపు చూస్తూ కూర్చుంది. ఆ అమ్మాయి ఎక్కువ మాట్లాడదని మాత్రం నాకర్థమైంది. సరోజ వాగుడుకాయ. మొదట్నించీ అంతే. ఇప్పుడు ఇంకా ఎక్కువైంది. బహుశా ఈ విషయంలో కూడా దివ్యకి తండ్రి పోలికే వచ్చి ఉంటుందనుకున్నాను. దివ్యని నారాయణగూడాలోని ఒక కోచింగ్ సెంటర్ దగ్గర డ్రాప్ చేసి, మేం చిక్కడపల్లిలోని సరోజ ఇంటి ముందు ఆటో దిగిపోయాం.

ఇండిపెండెంట్ హౌస్. వాళ్ల మావగారు నలభైఏళ్ల క్రితం కట్టించిన ఇల్లు. ఆయన అడ్వొకేట్. సరోజ భర్త కూడా అడ్వొకేట్. గేటుకి రెండువైపులా లాయర్ వీరభద్రం, లాయర్ రామబ్రహ్మం అనే నేమ్ ప్లేట్స్ ఉన్నాయి.

“మీవారి పేరేంటి?” అడిగాను సరోజ వెనకాలే లోపలికి నడుస్తూ.

“రామబ్రహ్మంగారు” అంది.

తర్వాత నన్ను కూర్చోమని చెప్పి లోపలికి వెళ్లింది. నేను గది పరిశీలిస్తూ నిలబడ్డాను. ముందు గదిలో రాక్స్ నిండా లా పుస్తకాలు. టేబిల్ మీద కూడా ఆ పుస్తకాలే. లోపల హాల్లో కూడా అవే పుస్తకాలు, జర్నల్స్. ఇల్లంతా సామానుతో, పుస్తకాలతో గందరగోళంగా ఉంది. ఇల్లు పెద్దదే. కానీ సరిగ్గా సర్దుకోకుండా, నీట్‌గా ఉంచుకోక పోవడంతో ఇరుగ్గా, చిరాకుగా అనిపిస్తోంది. తిరిగివచ్చిన సరోజ ‘లోపలికి రావే’ అంటూ తనతోపాటు డైనింగ్ హాల్లోకి తీసికెళ్లి “కూర్చో, కాళ్లూ చేతులు కడుక్కొస్తా” అంటూ పెరట్లోకి వెళ్లివచ్చింది.

డైనింగ్ టేబిల్‌నిండా ఉదయం వండుకుని తినగా మిగిలిన వంటకాల గిన్నెలు. కొన్నిటి మీద మూతల్లేవు. కొన్నిట్లో గరిట అలాగే ఉంచి మూతపెట్టారు. ఉప్పు, మిరియాల పొడి ఉంచిన చిన్నచిన్న ప్లాస్టిక్ డబ్బాలు. స్పూన్స్ వేసిన ఒక ప్లాస్టిక్ డబ్బా. ఎప్పుడో తెచ్చిపెట్టిన స్వీటు పాకెట్లు, వాటిల్లో మిగిలిన ఒకటీ, అరా స్వీట్లు. బాగా మగ్గిపోయిన అరటిపళ్ళు రెండు. పప్పు, ఊరగాయ మరకలతో నిండి ఉంది టేబిల్.

“కాఫీ తాగుతావా? టీనా?” అడుగుతూ కిచెన్‌లోకి నడిచింది సరోజ.

నేనేం మాట్లాడలేదు. తను అడిగిందే కానీ, నా జవాబు వినిపించుకో

కుండానే ఐదు నిమిషాల్లో కాఫీ కలిపి కప్పులో పోసి ఒకటి నాకిచ్చింది. రెండో కప్పు తీసుకుని ఇప్పుడే వస్తా అత్తయ్యకి కాఫీ ఇచ్చి" అంటూ ఒక బెడ్‌రూమ్‌లోకి వెళ్లింది. డిగ్రీ దాకా చదువుకున్న సరోజ, ఎన్నో కొన్ని ఆదర్శభావాలున్న సరోజ ఒక మామూలు గృహిణి అయింది. పెళ్లయి పదిహేనేళ్లు. ఇద్దరు పిల్లల తల్లి. భర్త, పిల్లలు, అత్తగారి, మావగారి బాధ్యతలు. వీటిల్లో పడి తన శరీరం మీదా, ఇంటిమీదా కూడా శ్రద్ధ చూపించడంలేదని స్పష్టంగా అర్థం అవుతోంది. రకరకాల బ్యూటీ టిప్స్ ప్రతి పేపర్‌లో, టీవీల్లో చెప్తున్నా ఏ ఒక్కటీ సరోజ పాటించడంలేదని తెలుస్తోంది.

అత్తగారికి కాఫీ ఇచ్చి తన కప్పు తెచ్చుకుని "చెప్పవే" అంటూ కుర్చీలో కూర్చుంది నా ఎదురుగా.

"ఏం చెప్పను? నిన్ను చూస్తుంటే నాకు చాలా కోపం వస్తోంది" అన్నాను.

"ఏం ఎందుకు?" ఆశ్చర్యంగా చూసింది.

"ఏంటా అవతారం? జుట్టు నెరిస్తే రంగేసుకోవచ్చుగా. మొహం గురించి అసలు పట్టించుకోవా? ఆ పొట్ట ఏంటి? మార్నింగ్ వాక్ చేయవా?"

సరోజ పకపకా నవ్వుతూ నన్ను పరిశీలనగా చూసింది. "నువ్వంటే ఉద్యోగస్తురాలివి. మొహం, జుట్టు, పర్సనాలిటీ అన్నిటి మీదా శ్రద్ధ వహిస్తూ, ఇప్పటికీ అందంగా, నాజూగ్గానే ఉన్నావు. వంట చేయడానికి వంట మనిషి, పనికి పనిమనిషి ఉంటుంది. నీకు పని ఉండదు. కానీ, నాకెలా కుదుర్తుంది? తెల్లారి లేచిందగ్గర్నించి హడావుడి, ఉరుకులు,పరుగులు, వంట, టిఫిను, కాఫీలు అందించడాలు. మధ్యమధ్య అతిథులు, బాధ్యతలు. ఇంట్లోనే బోలెడంత వాక్" అంటూ "అవునే నువ్వెలా మెయిన్‌టైన్ చేస్తున్నావు, మీ ఆయన బాగా కోపరేట్ చేస్తాడా?" అడిగింది.

నవ్వాను.

"ఇందాకట్నించి చూస్తున్నాను. ప్రతిదానికీ నవ్వుతావేంటే! నీ విషయాలేవీ చెప్పవేం?" ఖాళీ కాఫీ కప్పు టేబిల్ మీద పెట్టేసి కోపంగా అడిగింది.

"ఏం ఉంది చెప్పడానికి? అయినా చెప్పేకన్నా నువ్వు వచ్చి చూస్తే బాగుంటుంది."

"ఏం– చెప్పడానికి సిగ్గా. నలభై ఏళ్లు దాటి ఇంకా సిగ్గేంటే బాబూ... ఆ రోజులు పోయాయి. ఏమిటో కాలం ఎంత త్వరగా గడిచిపోతోందో! చక్కగా

పెద్దపెద్ద జడలేసుకుని, పరికిణీ ఓణీలు వేసుకుని కాలేజీకి వెళ్లిన రోజులు గుర్తొస్తే... అబ్బా తీయటి రోజులన్నీ ఇంత త్వరగా వెళ్లిపోయాయేంటి అనిపిస్తుంది.”

సరోజ మాట్లాడుతుండగానే నాలుగైంది. గోడ గడియారం గంటల శబ్దం విని చటుక్కున లేచింది. “అమ్మో నాలుగైంది. ఈయన వచ్చేస్తారు. టిఫిన్ చేయాలి” అంటూనే లేచి వెళ్లి, ఒక ఉల్లిపాయ, పచ్చిమిరపకాయలు రెండు, అల్లం తెచ్చుకుని చాకుతో టేబిల్ మీదే కోయడం మొదలుపెట్టింది.

“ఏవిటోనే, పెళ్లవగానే సంసారం అనే సముద్రంలో పడిపోతాం అని ఆ రోజు అనిపించి ఉంటే పెళ్లి చేసుకోకపోదునేమో” అంటూ మళ్లీ గడియారం వైపు చూసింది. నాలుగూ పది అయింది. “ఈయన ఇంకా రాలేదేంటో” అంటూ తరిగిన ముక్కలన్నీ ప్లేటులో వేసి లేచింది.

ఒకసారి వీధి వాకిలి వైపు తొంగి చూసి “ఏంటబ్బా ఇంకా రాలేదు” అంటూ తరిగిన ముక్కలు పెట్టిన ప్లేటు తీసుకుని కిచెన్‌లోకి వెళ్లింది.

ఉప్మా పోపు వాసన వచ్చింది నాకు.

మళ్లీ నా దగ్గరకు వచ్చి “ఉండు ఈయనకి ఓసారి ఫోన్ చేస్తాను. నాలుగయ్యే సరికి ఠంచనుగా రావాలి. రాలేదేంటో” అంటూ లోపలికి వెళ్లి కార్డ్‌లెస్ తీసు కొచ్చింది. నెంబరు కలుపుతున్న సరోజ మొహంలో టెన్షన్ చూస్తుంటే ‘ఎందుకంత కంగారు? అతనేం చిన్నపిల్లాడా’ అనిపించింది నాకు. ఇంతా చేస్తే నాలుగుంబావు అయింది. పదిహేను నిమిషాలు ఆలస్యం అయితే ఇంత టెన్షనా? భర్తంటే ఎంత ప్రేమ దీనికి.

“వస్తారులే సరోజా... పది నిమిషాలు అటూ ఇటూ... ఎలా వస్తారు? స్కూటరా? కారా?”

“కారే! కోర్టు అయిపోగానే మావయ్యగారిని క్లబ్ దగ్గర దింపి ఈయన ఇంటికే వస్తారు. ఏంటో ఇంకా రాలేదు. ఏమైందో ఏమో, బొత్తిగా టైం సెన్స్ ఉండదే మగవాళ్లకి. బైట పెత్తనాలు ఏం ఉంటాయి? ఇంటి దగ్గర పెళ్లాం, పిల్లలు ఎదురుచూస్తుంటారన్న జ్ఞానం ఉండదు ఈ మనిషికి. ఛ... ఈ నెంబరు ఎప్పుడూ కలవదు” అంటూ కార్డ్‌లెస్, టేబిల్ మీద విసురుగా పడేసి, మళ్లీ కిచెన్‌లోకి వెళ్లింది. మరుగుతున్న నీళ్లల్లో రవ్వ వేసి బాగా కలిపి, ఉప్మా మీద మూతపెట్టి స్టవ్ ఆర్పేసి వచ్చింది.

ఇప్పుడు సరోజ స్వరం మూగపోయింది. మాటలాపేసి, టెన్షన్‌తో గేటువైపు

తొంగితొంగి చూస్తోంది. దాని టెన్షన్ చూస్తుంటే ఇంక నాకు ఉండబుద్ధి కాలేదు. “నేను వెళ్తానే... మళ్లీ కలుద్దాం” అంటూ లేచాను.

“ఉండు ఆయనొచ్చాక పరిచయం చేస్తాను” అంది.

“ఇంకోసారి పరిచయం చేసుకుంటాలే. ఇప్పుడు నాకు వేరే పనుంది” అంటూ లేచాను.

బైట కారు ఆగిన శబ్దం అయింది. సరోజ చటుక్కున కుర్చీలోంచి లేచి పరిగెత్తినట్టుగా బైటికి వెళ్లింది.

ఎంత ప్రేమ భర్తంటే. ఎంత ఆరాటం! ఆయన వచ్చేటప్పటికి టిఫిన్ చేసిపెట్టి, ఆయన క్షేమం కోసం తపిస్తూ, అబ్బ... సరోజలాంటి భార్యని పొందిన అతను అదృష్టవంతుడు అనిపించింది. అతను కూడా ఎంత ఠంచనుగా వచ్చాడు ఇంటికి.

పెళ్లి కాని నాకు ఇలాంటి అనుభవం ఎప్పుడూ ఎదురవలేదు. భార్యాభర్తలు ఒకరికోసం ఒకరు తపనపడుతూ, ఒకరినొకరు ప్రేమించుకుంటూ, ఒకరికొక రుగా బతకడమే జీవితం కాబోలు. స్వంత ఇల్లు, కావాల్సినంత డబ్బు, పెద్ద దిక్కుగా అత్త మామలు, రత్నాల్లాంటి పిల్లలు, కనుసన్నల్లో మెలిగే భర్త ఇంతకన్నా ఏంకావాలి ఆడదానికి?

ఒక్కక్షణం ఉలిక్కిపడ్డాను. కెరియర్, కెరియర్ అంటూ ఎప్పటికప్పుడు పెళ్లి వాయిదా వేస్తూ, వచ్చిన సంబంధాలన్నీ తిరగ్గొట్టి, తీరా చేసుకోవాలనుకునే సరికి వయసు దాటిపోయింది. రెండో పెళ్లివాళ్లు రావడంతో పెళ్లే మానుకున్నాను. ఇప్పుడింక ఆ ధ్యాస కూడా లేదు. అలాంటిది ఇప్పుడు సరోజని చూశాక నా మనసు మళ్లీ పెళ్లి మీదకు మళ్లింది. ప్రేమానురాగాలతో, పరస్పరం గౌరవించు కుంటూ, ఒకరి క్షేమం కోసం ఒకరు ఆరాటపడుతూ జీవించేందుకే పెళ్లి అనే తంతు కావాలి కాబోలు. ఇలా వంటరిగా బతికే బతుకు కూడా బతుకేనా... సన్నగా నిట్టూర్చాను.

లోపలి నుంచి సరోజ స్వరం వినిపించింది. “కోర్టు అయిపోగానే ఇంటికి రాకుండా ఎక్కడికెళ్లారు? నాలుగున్నర అయింది. క్లబ్ చూడగానే మీకూ కాస్సేపు కూర్చోవాలనిపించిందా? రేపట్నించి మీ నాన్నగారిని దింపడానికి మీరు వెళ్లొద్దు. ఆయన్ని ఆటోలో వెళ్లమనండి. లేదంటే ఇంకో కారు కొనుక్కోమనండి. మీరు నాలుగయ్యేసరికి ఇంట్లో ఉండాలి, అంతే! కాళ్లు, చేతులు కడుక్కురండి. టిఫిన్ పెడతాను. నా ఫ్రెండ్‌ని పరిచయం చేస్తాను. చూడండి... ఆడపిల్ల కనిపించింది

కదా అని తేరిపార చూడకుండా విష్ చేసి మీ గదిలోకి వచ్చేయండి. రండి త్వరగా" మాటలు ఆగిపోయాయి.

సరోజ నా దగ్గరకు వచ్చింది.

నేను నిశ్చేష్టురాలినయ్యాను. సరోజ... భర్త రావడం ఆలస్యం అయిందని టెన్షన్‌తో కూర్చున్న సరోజ. కూతురు ఎక్కడ కందిపోతుందో అని బరువంతా తానే మోసిన సరోజ... అత్తగారికి టైంకి కాఫీ ఆవిడ గదిలోకే తీసికెళ్లి ఇచ్చిన సరోజ... సంసార భారం బరువైనా తానే సహనంతో మోస్తున్న సరోజ.

ఈమెకు ఉన్నది తన వాళ్ల పట్ల ప్రేమా లేక వాళ్లంతా తన గుప్పిట్లో ఉండాలన్న పంతమా? అందుకేనా 'ఒక గంట నేనింట్లో లేకపోతే ఇల్లంతా తల్లకిందులైపోతుంది అంది. ఈ సంసారం కోసం, ఈ కుటుంబం అనే రక్షణ వలయం కోసం తనని తాను మర్చిపోయి, తన స్వేచ్ఛనీ, తన ఆశల్ని, తన ఆరోగ్యాన్ని, అందాన్ని, అన్నిటినీ నిర్లక్ష్యం చేస్తూ ఇంటిల్లిపాదినీ తన కనుసన్నల్లో పెట్టుకుని ఎంతకాలం కాపాడుకోగలదిలా."

సరోజది త్యాగమా? స్వార్థమా? నాకేం అర్థంకాలేదు.

ప్లేట్లలో ఉప్మా పెట్టుకుని టేబుల్ దగ్గరకు వస్తున్న సరోజ వైపు అయోమయంగా చూస్తున్న నాకు పెరట్లో పంపు దగ్గర కాళ్లు, చేతులు కడుక్కుని తలవంచుకుని లోపలికి వస్తున్న లాయర్ రామబ్రహ్మం ఉరఫ్ సరోజ మొగుడు కనిపించాడు.

నిట్టూర్చి లేచి నిలబడ్డాను, బ్యాగు చేతిలోకి తీసుకుని.

***

*(మార్చి 2009, విపుల)*